# స్థాయి

కలువకొలను సదానంద



**మా మల్లప్ప ఎన్నికల్లో పోటీచేసిన సందర్భాలు మూడు.**

**తొలిసారి గ్రామపంచాయితీకి వార్డు మెంబరుగా పోటీ చేశాడు. మనవాడు గెలవాలని మనసారా ఆకాంక్షించాము. మిత్రులుగా మేము చేయవలసిందంతా కూడా చేశాము. అయితే ఆశ్చర్యకరంగా వాడు ఓడిపోయాడు. నాకైతే వీథిలోకి వెళ్లటానికి కూడా మొహం చెల్లలేదు.**

మర్నాడే మా ఇంటికొచ్చాడు మల్లప్ప. "పోతే పోయిందిలేరా! మహమ్మద్ ఘోరీ ఎన్నిసార్లు ఓడిపోలేదూ? ఫస్టు షాట్‌కే పిట్ట పడాలనుకోవడం కూడా పేరాశే! ఏమంటావ్?" అంటూ నన్నే ఓదార్చాడు. "ఓట్లు ఎవరు వేశారు, ఎవరు వేయలేదన్నది మనకు అనవసరం. మనపైన అభిమానమున్న వాళ్లంతా వేశారు పాపం! ఓసారి అలా వెళ్లి అందరికీ థాంక్స్ చెప్పి వద్దాం, పద!" అంటూ నన్ను వెంటబెట్టుకుని ఆ వార్డులోని గుమ్మాలన్నీ ఎక్కి దిగేశాడు.

రెండోసారి మళ్లీ - సర్పంచ్ పదవికి పోటా చేశాడు. ఈసారి వాడు గెలవకపోవటమా? యువకుడు, ఆరోగ్యవంతుడు, మంచితనమూ ప్రసన్నతా ఉన్నవాడు, ఊళ్లో బంధుబలానికి కొదవలేనివాడు, పురజనుల అభిమానం చూరగొన్నవాడు - మల్లప్పకంటె ఇంకెవరున్నారు? ఇక మేం ఊరుకుంటామా? బాల్య స్నేహితుడికోసం - సహాధ్యాయికోసం - ఏం చెయ్యటానికయినా సిద్ధంగా ఉన్నాం కదా? కాలికి బలపం కట్టుకుని ఇల్లిల్లూ తిరిగాం. కరపత్రాలు అచ్చు వేయించాం. సంతలో, జాతరలో నిలబడి వాటిని పంచిపెట్టాం. పగలు విశ్రాంతి లేదు, రాత్రి నిద్ర లేదు. ఇంత చేసి కూడా ఏం లాభం? మల్లప్ప ఓడిపోయాడు. నేనైతే దిగులుపడిపోయాను. మర్నాడు మా ఇంటికే వచ్చాడు వాడు. "ఛీ!ఛీ! ముసుగు కప్పుకుని పడుకున్నావేం? లేచి కూచోరా!" అన్నాడు. "దీనికే దిగులుపడిపోతే ఎట్లారా? స్పోర్టివ్‌గా తీసుకోవాలి!" అంటూ ఊరడించాడు. "సిన్సియర్‌గా పనిచేసినవాళ్లు ఊళ్లో ఇంకా ఇద్దరు ముగ్గురున్నారు. వాళ్లను కూడా కలుసుకోవాలి. వెళ్లొస్తాన్రా!" అంటూ వెళ్లిపోయాడు. పిచ్చివెధవ, ఎంత కృతజ్ఞత వీడికి!

ఆ తరువాత మూడేళ్లకు నా సిక్స్ సెన్స్‌కు ఎలా తెలిసిపోయిందో ఏమో - "ఒరే మల్లీ! నవ్వు ఎమ్మెల్యే కావడం ఖాయం! పార్టీ టిక్కెట్ కోసం ట్రై చెయ్!" అన్నానడు.

"అమ్మో! అసెంబ్లీ సీటే! ఎగతాళి చెయ్యకురా నన్ను!" అన్నాడు మల్లప్ప.

గట్టి ప్రయత్నమో, అదృష్టమో - ఏదైతేనేం, వాడికి పార్టీ టెక్కెట్టొచ్చింది.

"ఒరే! నేను గెలుస్తానంటావా?" అన్నాడు.

"పోరా ఫూల్! అలాంటి సందేహాలు పెట్టుకోకు!" అని డబాయించేశాను.

కరపత్రాలు, బానర్లు, కటౌట్లు, మైకులూ, జీపులూ - చెప్పాలా ఇక! పార్టీ అండ ఉండనే ఉంది. కొంపా గోడూ వదిలిపెట్టి వాడవాడకూ పల్లెపల్లెకూ తిరగటమే నాలాంటి వాళ్ల పని.

కౌంటింగ్ రోజున తాలూకా కేంద్రానికే వెళ్లిపోయాడు మల్లప్ప. రెండు వందల ఓట్ల తేడాతో ముందుకీ వెనక్కీ ఊగిసలాడుతున్నట్లు వార్తలు అందుతూనే ఉన్నాయి. మల్లప్ప గెలిచాడన్న వార్త విన్న సంతోషంలో ఆ రాత్రి నిద్ర పట్టలేదు కదా!

తెల్లవారి లేచి ఆదరాబాదరా కాలకృత్యాలు ముగించుకుని బయటకు వెళ్లబోతుండగా, "ఎక్కడికండీ ఆ పరుగు?" అంది మా ఆవిడ.

"మల్లప్ప రాత్రే వచ్చేశాట్ట కదా!" అన్నాను అర్థోక్తిగా.

"ఎటూ ఆయనే వస్తారుగా మీ కోసం?" అంది.

"అందాకా ఆగలేను కదా!" అంటూ వీథిలోకి వెళ్లిపోయాను. మా ఆవిడ చెప్పినట్లు వాడు నాకోసం ఎదురుపడతాడేమో ననిపించింది.

మల్లప్ప ఇల్లు చేరుకున్నాను. గర్భగుడిలో దేవుడిలా వాడు ఎంత లోపలున్నాడో గానీ, నాలాగే అభినందించటానికి వచ్చిన జనం ఇంటిముంగిట కిటకిటలాడిపోతున్నారు.

... మూడేళ్లు గడిచిపోయినా, నాకోసమంటూ వాడు - సారీ - మల్లప్పగారు మా ఇంటికి రావటం ఇంతవరకూ జరగలేదు. ■